క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ధర్పల్లి: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని తహసీల్దార్ మాలతి భోజన నిర్వాహకులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటగదిలోని బియ్యం, కూరగాయలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వండిన భోజనాన్ని నిర్వాకులు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలన్నారు. భోజన విషయంలో నాణ్యత లోపిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఆమె వెంట ఆర్ఐ రాజేశ్వర్ ఉన్నారు.

ఘనంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ జన్మదిన వేడుకలు


ఆనంద నిలయంలో కేక్ కట్ చేసి పిల్లలకు తినిపిస్తున్న రాజేశ్

సుభాష్‌నగర్: నగరంలోని న్యాల్‌కల్‌రోడ్‌లో ఉన్న ఆనంద నిలయంలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ పబ్లిక్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిలయంలోని బాలుర సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జి మంతెన రాజేశ్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది నరహరి జన్మదిన వేడుకల సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటంకాలు లేకుండా ఆలయ నిర్మాణం


విధుశేఖర భారతి స్వామికి ఆలయ నమూనా ప్రతిని అందజేస్తున్న మంచాల జ్ఞానేందర్

సుభాష్‌నగర్: నగరంలోని అమ్మవెంచర్‌లో కొలువుదీరనున్న వారాహి అమ్మవారి ఆలయ నిర్మాణం ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తవుతుందని, అమ్మవారి అనుగ్రహం సంపూర్ణంగా ఉందని శృంగేరిలోని శ్రీ శారదపీఠంలో ఉన్న విధుశేఖర భారతి స్వామి అన్నారు. శనివారం వారాహి అమ్మవారి ఆలయ కమిటీ ప్రతినిధి, ప్రముఖ సామాజిక సేవాకర్త మంచాల జ్ఞానేందర్ గుప్తా శృంగేరిలోని శ్రీ శారదపీఠంలో స్వామి వారిని కలిసి ఆలయ నమూనా, ప్రత్యేకతలు, ఇతరత్ర అంశాలను వివరించారు. అనంతరం విధుశేఖర భారతీ స్వామికి ఆలయ నమూనా ప్రతిని అందజేశారు. ఆలయ నిర్మాణంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా పూర్తయ్యేలా ఆశీర్వదించాలని మంచాల జ్ఞానేందర్ స్వామి వారిని విజ్ఞప్తిచేశారు. ఆయన వెంట బ్రహ్మ శ్రీ పురాణం మహేశ్వర శర్మ, పశుపతి శర్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న పాఠశాల ది స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో అశోక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు, ఆటలు ముఖ్యమని అన్నారు. పాఠశాల విద్యార్థులు వివిధ వేషధారణలలో అలరించారు. దేశభక్తి పాటలపై నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహ, నర్సింగ్‌రావ్, మధుమిత, సుజాత, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌ల చోరీ

నవీపేట: మండల కేంద్రానికి చెందిన ర్యాగల్ల ప్రభాకర్ ద్విచక్ర వాహనం శుక్రవారం రాత్రి చోరీకి గురైనట్లు ఎస్సై వినయ్ శనివారం తెలిపారు. ఇంటి బయట నిలిపి ఉంచిన బైక్‌ను దుండగులు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. శనివారం మేకల సంతకు వచ్చిన బోధన్‌కు చెందిన మహేశ్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు అపహరించినట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- రాబోయే రోజుల్లో ప్రత్యేక కార్యాచరణతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘం నాయకులు


బోర్గాం(పి) చౌరస్తాలో అమరులకు నివాళులు అర్పిస్తున్న నాయకులు


డిచ్‌పల్లిలో నినాదాలు చేస్తున్న నాయకులు

మోపాల్/ జక్రాన్‌పల్లి/ డిచ్‌పల్లి/ నిజామాబాద్‌అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగర శివారులోని బోర్గాం(పి) చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణ సాధనకు అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా మాజీ ఇన్‌చార్జి గంధమాల నాగభూషణం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం కోసం నిరంతరం జరుగుతున్న పోరాటంలో భాగంగా మాదిగ ఉప కులాలు నాయకులు ఎంతోమంది అమరులయ్యారని అన్నారు. వారి ఆశయాలను భవిష్యత్తులో కొనసాగిస్తామని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల్లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మాదిగల ఆగ్రహానికి ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రత్యేక కార్యచరణతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గంగారాం, రాములు, గంగా నర్సయ్య, మల్లేశ్, ఆశ నారాయణ, సుజిత్, కుమ్మరి శంకర్, కిషన్, మనోహర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డప్పు దరువుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి, మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ కూడలి వద్ద అమరుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, మండల అధ్యక్షుడు వేల్పుల వరుణ్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కనక శ్రీదీప్ తదితరులు పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి, మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాదిగ అమరవీరుల త్యాగాల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాటం కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు డప్పు నర్సయ్య, నాయకులు కె సాయిలు, కె సుమన్, మైలారం గణేశ్, కె పోశెట్టి, కె రమేశ్, చాట్ల సంజీవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణకు గత 30 ఏళ్లుగా జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు మరువలేనివాని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నాగభుషణం అన్నారు. నగరంలో మాదిగ అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఆశా నారాయణ, సుజిత్, శ్రీకాంత్, మనోహర్, గంగారాం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ప్రవేశపెట్టి 11 శాతం రిజర్వేషన్ సాధించినప్పుడే మాదిగ అమలరులకు నిజమైన నివాళి అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ వర్గీకరణ సాధనకు అసువులు బాసిన మాదిగ అమరులకు నివాళుల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు సురేశ్, పోశెట్టి, మారుతి, మైలారం బాలు తదితరులు పాల్గొన్నారు.


తొర్లికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మార్పీఎస్ నాయకులు


జిల్లా కేంద్రంలో అమరుల ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


అంబేద్కర్ భవన్‌లో..

సిర్పూర్ విద్యార్థినికి ఉత్తమ కథా బహుమతి


అక్షయను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

మోపాల్: మండలంలోని సిర్పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని టి అక్షయకు జాతీయస్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫిక్షన్ కథ పోటీల్లో బహుమతి లభించిందని హెచ్ఎం విసత్యనారాయణ తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇటీవల సైన్స్ ఫిక్షన్ జాతీయ స్థాయి కథల పోటీలను హైదరాబాద్‌లోని బాల సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారని పేర్కొన్నారు. పోటీల్లో పాఠశాల నుంచి విద్యార్థులు రాసిన 15 కథలను పంపించామన్నారు. టి అక్షయ రాసిన 'రూపాలు మార్చుకునే రోబో' ఉత్తమ కథగా బహుమతి గెలుపొందిందని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల తెలుగు విద్యార్థులు 43 మంది ఈ పోటీల్లో పాల్గొనగా, తమ పాఠశాల విద్యార్థి ఉత్తమ బహుమతి గెలుచుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం సంస్థ అందించిన నగదు బహుమతి, సర్టిఫికెట్‌ను అక్షయకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేశ్ రావు, ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, వందన, గాయత్రీ నీలేశ్, అక్బర్ బాషా, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిరికొండ: జాతీయ స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్, స్పెల్ బీ పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రావుట్ల నర్సయ్య శనివారం తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ప్రతిభ కనబర్చి వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి టాపర్లుగా నిలిచి చాంపియన్‌షిప్ అవార్డులు సాధించారని అన్నారు. విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పీఎస్ఎం ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించే జాతీయ స్థాయి అబాకస్‌లో ఎస్ కార్తీక, కె అనన్యపాటిల్, ఎన్ అవంతిక, టి శివాని, వేదిక్ మ్యాథ్స్‌లో టి నిహాల్, కె హర్షిత్, స్పెల్‌బీలో జి కృతిక పాల్గొననున్నారు. విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందజేసి ప్రిన్సిపాల్ అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గత నెల 20 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ సర్వే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో జరుగుతోందన్నారు. సిటిజన్ల నుంచి ఫీడ్‌బ్యాక్ పెంచే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే పట్టణ ప్రజలు మొబైల్ యాప్ ద్వారా కూడా తమ ఫీడ్‌బ్యాక్ ఇవ్వచ్చన్నారు. మున్సిపాలిటీ అందించే సేవలపై పది ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజలు ఇంటిపన్నులు, ట్రేడ్ లైసెన్స్ మార్చి 31లోపు చెల్లించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ హయూమ్, డీఈ భూమేశ్, అధికారులు శేఖర్, ప్రవీణ్, మనోహర్, దత్తారెడ్డి, శానిటరి ఎస్సై గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం


మహిమను అభినందిస్తున్న డివిజన్ పెద్దలు

నిజామాబాద్ రూరల్: హర్యానాలో ఇటీవల నిర్వహించిన నేషనల్ నెట్‌బాల్ పోటీల్లో సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బగ్గలి మహిమ ఉత్తమ ప్రతిభ కనబర్చింది. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మహిమను డివిజన్ పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ పెద్దలు నగేశ్, సుదర్శన్, రాంసింగ్, రవి, శ్రీనివాస్, జుబేర్, నర్సయ్య, సాయిలు, వెంకటి, అశోక్, అనిల్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు


విద్యార్థినికి కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యుడు

బాల్కొండ: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు జాతీయ అంధత్వ నివారణ పథకంలో భాగంగా శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు గురురాజ్ విద్యార్థినులకు కంటి పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఎంఈవో రాజేశ్వర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్‌వో భవాని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..


పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పలుచోట్ల మిషన్ భగీరథ నీరు పైప్‌లైన్ లీకేజీలు కావడంతో అధికారులు వాటికి మరమ్మతు పనులు చేపట్టారు. పైప్‌లైన్ లీకేజీలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు 'సాక్షి' దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు' కథనానానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని జెండాగల్లీలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలను మున్సిపల్ సిబ్బంది గుర్తించి మరమ్మతు పనులు చేపట్టారు. అలాగే మిగిలిన చోట్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పాఠశాలకు ట్యాబ్‌ల సరఫరా


ట్యాబ్‌లతో విద్యార్థులు

సిరికొండ: పీఎం శ్రీ స్కూల్‌లో భాగంగా సిరికొండ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల/కళాశాలకు 25 ట్యాబ్‌లను తెలంగాణ పాఠశాల విద్యా శాఖ నుంచి సరఫరా అయ్యాయని ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి శనివారం తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపుదలకు రూ. ఐదు లక్షల విలువ చేసే 25 ట్యాబ్‌లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ వివిధ రకాల సమాచారాలను నిర్వహించడానికి, ప్రసారం చేయడానికి ఉపయోగించే విస్తృత సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండి, ఉపాధ్యాయుల బోధన, అభ్యాసన ప్రక్రియలను సులభతరం చేస్తాయని తెలిపారు. ఇ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, వర్చువల్ క్లాస్‌రూంలు, ఆన్‌లైన్ కోర్సులు, పరీక్షలు నిర్వహించడానికి పాఠశాలలో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ టీవీలు అనుసంధానం చేయానికి ఈ ట్యాబ్‌లు ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

వైభవంగా రామకృష్ణ పరమహంస జయంతి


శివాజీనగర్‌లో హోమం చేస్తున్న నిర్వాహకులు


రామకృష్ణ పరమహంస చిత్రపటానికి పూలమాల వేస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న రామకృష్ణ కుటీర్‌లో రామకృష్ణ జయంతిని శనివారం వైభవంగా నిర్వహించారు. రామకృష్ణ కుటీర్ నిర్వాహకులు ఎస్ఎన్ చారి ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, విష్ణు పారాయణంతో పాటు యజ్ఞ హవనం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఎస్ఎన్ చారి మాట్లాడుతూ.. రామకృష్ణ పరమహంస నడిచిన బాటలో ప్రతి విద్యార్థి నడవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలోని రామకృష్ణ ద్యానమందిరంలో రామకృష్ణ పరమహంస జయంతి నిర్వహించారు.


పారాయణం నిర్వహిస్తున్న భక్తులు

కార్యక్రమంలో నితా బెన్, సి సాయిప్రసాద్, యోగా రాంచందర్, ప్రకాశ్ గౌడ్, బచ్చు గోపాల్, నారాయణ, నాగేశ్వరావు, గంగా ప్రసాద్, జాదవ్ వసంత్, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

వేసవిలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు


అక్బర్‌నగర్ సబ్‌స్టేషన్‌లో వీసీబీని ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో డీఈఈ

రుద్రూర్: బోధన్ డివిజన్‌లో సమ్మర్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ ఎండీ ముక్తార్ పేర్కొన్నారు. రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన వ్యాక్యుమ్ సర్క్యూట్ బ్రేకర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బొప్పాపూర్, అక్బర్‌నగర్ వ్యవసాయ ఫీడర్లకు ఒకే వీసీబీ ఉన్నందున విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలిగే ఆస్కారం ఉందన్నారు. దీనిని తొలగించడానికి మరో వీసీబీని ఏర్పాటు చేశామన్నారు. బోధన్ డివిజన్‌లో 13 వీసీబీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కోటగిరి మండలం ఎత్తొండలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు వెల్లడించారు. బోధన్ మండలం ఆచన్‌పల్లి, సాలూర మండలం జాడిలో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కానున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ నగేశ్‌కుమార్, మండల ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్లు గిరిధర్, నవీన్, లైన్‌మన్లు గంగాధర్, శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

చిన్నాపూర్‌లో రైతు సంఘం సభ్యత్వం

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్‌లో శనివా రం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ ఆధ్వర్యంలో సంఘం గ్రామ స్థాయి నాయకులు శనివారం సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ శోభన్‌బాబు, సభ్యులు ఎర్ర సాయిలు, కొండ గంగాధర్, ఇడగొట్టు సాయిలు, విజయ్, నారాయణ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో మున్సిపల్ అధికారులు కాలనీవాసులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇంటింటికి వచ్చే మున్సిపల్ చెత్త వాహనాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, వార్డు ఆఫీసర్ నర్సయ్య, మెప్మా ఆర్పీలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి'

ఆర్మూర్‌టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగొట గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గల్ఫ్ బాధితులు, సామాజిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను గుర్తించి అసెంబ్లీ వేదికగా మంత్రుల, అధికారుల చూట్టు తిరుగుతూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. నందిపేట్ మండలం అ యిలాపూర్ వసతి గృహానికి రూ. 2.40 కోట్లు మంజూరు చేయించడంతో పాటు, ప్రజా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	81,900		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు


చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సింగ్	130
		లైవ్	80
స్కిన్‌లెస్	150	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-11.00.4.40.7.30, 10.20 - అగత్యా(తెలుగు)-1.40
స్క్రీన్-2	అగత్యా(తెలుగు)-11.00, 4.40 మజాకా(తెలుగు)-1.45, 7.35, 10.30
స్క్రీన్-3	గార్డ్(తెలుగు)-10.50 రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30 శబ్దం(తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.05 మజాకా(తెలుగు)-1.25 టర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-4.30, 7.40, 10.50
స్క్రీన్-2	మజాకా -10.00,4.15 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.05 ఛావా(హిందీ)-7.20, 10.40
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40 ఛావా(హిందీ)-12.50 తండేల్(తెలుగు)-4.10, 10.20 మజాకా(తెలుగు)-7.15
స్క్రీన్-4	ఓయ్(తెలుగు)-10.05 జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40 మజాకా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్(తెలుగు)
దేవి	మజాకా(తెలుగు)
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)